క్లుప్తంగా

క్రీడలతోనే ఆరోగ్యం



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రామీణ బ్యాంక్ సిబ్బంది

సంబేపల్లె : క్రీడలతో విద్యార్థుల ఆరోగ్యం దృఢంగా ఉంటుందని శెట్టిపల్లె గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అరుణకుమారిదేవి అన్నారు. శనివారం శెట్టిపల్లె కస్పాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో పోటీ తత్వం పెంచుకోవాలన్నారు. ఈ పోటీలలో దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర, సుధాకర్, ఉపాధ్యాయులు మురళీకుమార్, వసంత, సిద్దయ్య, గోపాల్, పీడీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల పూర్వపు విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అభినందన, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాల పూర్వపు విద్యార్థి కత్తి సాయికీర్తన బోదాపూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించి సంబేపల్లె జెడ్పీ పాఠశాలకు ప్రతిష్ట తెచ్చిందన్నారు. అలాగే మరో విద్యార్థి ఎం.వెంకట సుబ్బయ్య ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 440 మార్కులకు 433, కె.వర్షిని ఎంపీసీలో 470 మార్కులకు 463 మార్కులు, పదవ తరగతిలో షేక్ రుక్సానా 577 మార్కులు సాధించి షైనింగ్ స్టార్‌గా రూ.20 వేల రూపాయలు సొంతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని భోళాశంకర్ సేవాసమితి కమిటీ సభ్యుడు మహంకాళీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో శనివారం టోల్‌గేట్‌వద్ద సేవాసమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్ 400 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. బుడుగు శివయ్య, వాసబాబు, బండారు మల్లి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీలలో చేర్చాలి



ఓబన్న విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వడ్డెరలు

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వడ్డెరలను ఎస్టీలలో చేర్చాలని శనివారం స్థానిక వడ్డెర ఓబన్న విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి ఏడాది పూర్తయిందన్నారు. పక్క రాష్ట్రాలలో వడ్డెరలను ఎస్టీలలో చేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, చంద్రమౌళి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం మరొకరి ప్రాణం ఖరీదు



రక్తదానం చేస్తున్న యువకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఒకరు రక్తదానం చేస్తే మరొకరి ప్రాణం కాపాడినట్లేనని వైఎస్సార్ ఉద్యాన కళాశాల డీన్ పీటీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కళాశాలలో శనివారం జేబీవీఎస్ ది ఫ్రి సర్వర్, జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. 100 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికుమార్, డాక్టర్ నిశ్చల, దీప్తీకిరణ్, సుమంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దైవజ్ఞతోనే అందరికీ మంచి

కలకడ : దైవజ్ఞతోనే ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుందని, మనం చేసే పనిలోకూడ మంచి ఉండాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని దేవులపల్లెలో రెడ్డెప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన నాగవిగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భౌభౌ అంటే.. భయం భయం

- రాయచోటి పట్టణంలో కుక్కల స్వైర విహారం
- పాదచారులు, వాహనదారులపై పెరుగుతున్న దాడులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పాతరాయచోటిలో గుంపులుగా ఉన్న కుక్కలు



కొత్తపల్లె ప్రాంతంలో తిరుగుతున్న కుక్కలు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి మున్సిపల్ పరిధిలో అనేక ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రమైంది. మనుషులపై దాడి చేసి కరవడంతో పాటు పశువులు, మేకలు, కోళ్లపై కూడా దాడి చేసి హతమారుస్తున్నాయి. కుక్కల దాడి ఫలితంగా లక్షల రూపాయల మూగజీవాలను కోల్పోతున్నారు. ఇటీవలే పాత రాయచోటిలో కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. అలాగే పిచ్చికుక్క కూడా పలు ప్రాంతాల్లో స్వైర విహారం చేసి గాయపరిచింది. పాత రాయచోటి, మాసాపేట, జగదాంబ సెంటర్, కొత్తపల్లి, ఆలీమాబాద్‌వీధి, మదనపల్లి రోడ్డు, ఎన్జీఓ కాలనీ, గాలివీడు రోడ్డు మార్గాలు కుక్కలకు ఆవాసాలుగా మారాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులను, పాదచారులను కూడా వెంటపడి మరీ కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో పలు చోట్ల మేకలు, గొర్రెల మందపై దాడులకు పాల్పడినట్లు పలువురు పాడి రైతులు వాపోతున్నారు.

కుక్కలకు స్థావరాలుగా చికెన్ సెంటర్లు..

పట్టణంలోని చికెన్, మటన్, చేపల మార్కెట్ ప్రాంతాలు కుక్కలకు ప్రధాన స్థావరాలుగా మారుతున్నాయి. మాంసానికి అలవాటు పడ్డ కుక్కలు మార్కెట్లో దొరక్కపోతే మేకలు, కోళ్లు, పశువులు, మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని ప్రజలు వాపోతున్నారు. చాలా గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. వీటి నిర్మూలనకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కుక్కల సంఖ్య నానాటికీ అధికమవుతోంది.

పిచ్చి కుక్కలను కూడా చంపడం లేదు..

సాధారణంగా ఒక మోస్తరు ఆరోగ్యకరంగా ఉన్న కుక్కలను చంపకూడదనే నిబంధన ఉంది. జంతు సంరక్షణ సంస్థల కారణంగా ప్రభుత్వం ఈ నిబంధన విధించింది. అయితే పిచ్చికుక్కలను హతమార్చాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా మున్సిపల్ పరిధిలో వీటి నిర్మూలనకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అలాగే కుక్కల సంతతి వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ చర్యలు కానరావడం లేదు. దీంతో కుక్కల సంచారం నానాటికీ అధికమైంది.

కుక్కల బెడద తీవ్రం..



మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలపై దాడి చేస్తున్నాయి. పశు సంపదను నష్టపరుస్తున్నాయి. రైతులు నష్టపోతున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను, పశు సంపదను రక్షించాలి.

– కె.పెద్దరెడ్డయ్యరాజు, మదనపల్లె రోడ్డు, రాయచోటి పట్టణం

కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి



రాయచోటి మున్సిపల్ పరిధిలో పెట్రేగిపోతున్న కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్డుపై నడవాలన్నా, బైక్ మీద పోవాలన్నా కుక్కలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. భయంకర పరిస్థితుల్లో పట్టణ ప్రజలు జీవిస్తున్నారు.

– షేక్.అతావుల్లా, అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకుడు, రాయచోటి

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన జెడ్పీటీసీ

రామసముద్రం : తిరుపతిలోని తన స్వగృహంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, రామసముద్రం జడ్పీటీసీ సిహెచ్ రామచంద్రారెడ్డి, ఆయన భార్య ఉమా రామచంద్రరెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రాష్ట్రాలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న అరాచక పాలన, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్ గురించి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టిన బెదిరేది లేదన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి ముందుకు సాగుతామని జెట్పీటీసీ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లోకేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి యాప్ టీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరలు, శక్తియాప్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకర్షణీయమైన బహుమతులు, లోన్లు అంటూ వచ్చే మేసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవ్వరికీ చెప్పరాదని తెలిపారు. ఎక్కడైనా సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు.

శ్రావణ శనివారం.. పోటెత్తిన భక్త జనం

- వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలి వచ్చిన భక్తులు



గాలివీడు : విశేష అలంకారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి



సుండుపల్లె : ప్రత్యేక అలంకరణలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి



సంబేపల్లె : పూజలందుకున్న వీరాంజనేయస్వామి



నందలూరు: భక్తులతో నిండిపోయిన సౌమ్యనాథ స్వామి ఆలయం

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, చరిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. తొమ్మిది ప్రదక్షిణలు చేసి కోర్కెలు కోరుకునే భక్తులు, కోరికలు తీరిన తర్వాత 108 ప్రదక్షిణలు చేసే భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం మార్మోగిపోయింది. దర్శనానికి భక్తులు సుమారు గంట పాటు సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు శ్రీ సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

గాలివీడు : పెద్దూరు బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంగనాయకులు ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్ మూర్తికి తెల్లవారుజామునే అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. శ్రీవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

సుండుపల్లె : మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తలనీలాలను సమర్పించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు అమృ నాయక్ తెలిపారు.

అంజన్న ఆలయాల్లో..

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె, గుట్టపల్లె, సంబేపల్లె, నారాయణరెడ్డిపల్లె, దుద్యాల, మోటకట్ల, రౌతుకుంట, దేవపట్ల, ఎస్.సోమవరం, గున్నికుంట్ల, గురిగింజకుంట, దుద్యాల, పీఎస్‌కాలనీ తదితర గ్రామాల్లోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కడిగిన ముత్యంలా మిథున్‌రెడ్డి బయటకు రావాలి



టెంకాయలు కొట్టిన మిథున్‌రెడ్డి అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి లిక్కర్ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని స్థానిక ఆంజనేయస్వా స్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేసి 101 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అరాచక పాలనను ఎండగడుతున్నారనే పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు మోపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట శివసాయి, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, నందా బాలా, యనమాల మహేష్, శివయ్య, న్యాయవాది మధుసూదన్, మారెళ్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మట్లిరాజుల కోట.. చెత్తాచెదారమే నిండా!



కోటలో కనిపిస్తున్న చెత్తా చెదారం

సిద్దవటం : సిద్దవటంలోని మట్లి రాజుల కోట అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పర్యాటకులు కోటలోకి వెళుతూనే చెత్తా చెదారాలతో నిండడి అపరిశుభ్రం దర్శనమిస్తోంది. కోటలోని సిబ్బంది ప్రతి రోజు కోటలో పిచ్చి మొక్కలు తొలగించి పారిశుధ్యం పనులు చేపట్టాలి. అయితే అందుకు భిన్నంగా ఎలాంటి పనులు చేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. కోటలోని ముఖద్వారం పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించారు. అవి ఏ రోజు కూడా తెరుచుకోక పోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కోటలో విధులు నిర్వహించే ఎస్ఎంఆర్ సిబ్బంది దర్జాగా కుర్చీలో కూర్చొని కాలక్షేపం చేసి వెళుతున్నారే తప్ప బాధ్యతలను విస్మరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రజలతో శ్రీకాంత్‌రెడ్డి మమేకం



పార్టీ నేతను పరామర్శిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : గాలివీడు మండలం అరవీడు గ్రామం కొత్తపల్లెలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పర్యటించి ప్రజలు, పార్టీ కార్యకర్తలతో మమేకమయ్యారు. ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రెడ్డెప్ప రెడ్డికి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకుడు రెడ్డెప్పరెడ్డిని శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, యువత పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

నందలూరు : నిరుద్యోగ యువతకు వివిధ సాంకేతిక రంగాలలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ సీడ్యాప్ ఆధ్వర్యంలో డీడీయూజీకేవై ప్రోగ్రాం ద్వారా ఈ శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు మండల సమాఖ్యలో జరిగే సీడ్యాప్ క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ క్యాంపునకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సిద్దవటం : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సింగం క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సిద్దవటం మండలంలోని టక్కోలులో శనివారం ఆయన మాట్లాడుతూ 2024–2025 సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంటు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదన్నారు. ఫలితంగా వారు ఉన్నత చదువులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేయాలని కోరారు.

ఇసుక డంప్‌ల పరిశీలన

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ సచివాలయం వెనుక, డీకేటీ పొలాల్లో ఉన్న ఇసుక డంప్‌లను పరిశీలించామని టక్కోలు ఇన్‌చార్జి వీఆర్‌ఓ రజని తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండల తహసీల్దార్ తిరుమలబాబు ఆదేశాల మేరకు అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక డంప్‌లపై సమగ్రంగా విచారణ చేపట్టి పై అధికారులకు నివేదికను అందజేస్తామన్నారు.

కూటమి ప్రభుత్వం నిర్ణయంపై ఆర్టీసీ కార్మికుల నిరసన



ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజంపేట : ఆర్టీసీ డిపోలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎన్ఎంయూ(నేషనల్ మజ్దూర్ యూనియన్) ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున నిరసన తెలిపారు. డిపో గ్యారేజిలో ఎన్ఎంయూ నేతలు రమణ, శివయ్య ఆధ్వర్యంలో కార్మికులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గవర్నరుపేట డిపోను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు చంద్రబాబునాయుడు సర్కారు చేసిన ప్రతిపాదనలు వెంటనే విరమించుకోవాలన్నారు. ఆర్టీసీ ప్రైవేటు పరంతో కార్మికుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నేతలు, కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుదల



మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

రైల్వేకోడూరు అర్బన్ : ప్రకృతి వ్యవసాయంతో నేల స్వభావం మారి భూసారం పెరుగుతుందని దాని వల్ల మంచి దిగుబడులు వస్తాయని జేడీఏ శివనారాయణ తెలిపారు.

స్థానిక వ్యవసాయ భవనంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ వర్క్‌షాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో దొరికే వాటితో సాగుచేయడం వల్ల వచ్చే పంటలు మానవాళికి, భూమికి ముప్పు లేకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుబ్రమణ్యం, రమేష్, మల్లిక తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు.. సమస్యల నిలయాలు


రాజంపేట టౌన్/ ఓబులవారిపల్లె/ రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నా విద్యార్థులు భయం, భయంగానే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎక్కడ భవనాలు కూలుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పలుచోట్ల కటిక నేలపై ఓ పలుచటి దుప్పటి పరుచుకొని విద్యార్థులు నిద్రిస్తున్నారు. దీనికి తోడు కిటికీలు కూడా సరిగా లేక పోవడంతో చలి, దోమల వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. శుద్ధ జలం మాట దేవుడెరుగు. పలుచోట్ల హాస్టళ్లకు రక్షణ గోడ లేదు. వెరసి హాస్టళ్లు సమస్యల నిలయాలుగా మారుతున్నాయి.



ఓబులవారిపల్లె: అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల డార్మెంటరీలో మంచాలు లేని దృశ్యం



రాజంపేట టౌన్ : నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు



రైల్వేకోడూరు అర్బన్ : బాత్ రూమ్‌లో పగిలిపోయిన దోర్



రైల్వేకోడూరు అర్బన్ : విద్యార్థునులు చదువుకునే ప్రాంతంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్



లక్కిరెడ్డిపల్లెలోని బీసీ వసతి గృహంలో పెచ్చులూడుతున్న పైకప్పు



ఓబులవారిపల్లె: ముక్కవారిపల్లె గురుకుల పాఠశాలలో మరమ్మతులకు గురైన ఆర్వో వాటర్ ప్లాంట్



రాజంపేట టౌన్‌హాస్టల్‌లో దెబ్బతిన్న కిటికీలు